# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వము

పత్రికా ప్రకటన- 3 తేది:11.02.2015

తెలంగాణ ఉద్యమ సమయంలో బోర్ల రాజిరెడ్డిగా సుపరిచితుడైన బైరెడ్డి రాంరెడ్డికి బుధవారం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నుంచి అపూర్వ ఆదరణ లభించింది. తన గ్రామం, తన మండలం, తన జిల్లాకు సంబంధించిన పలు అంశాలను విన్నవించుకునేందుకు రాంరెడ్డి బుధవారం హైదరాబాద్ వచ్చారు. అపాయింట్మెంట్ కోరిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఇంటికే రావాలని ఆహ్వానించారు. దీంతో రాంరెడ్డి తన తోటి గ్రామస్తులతో సిఎం క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. రాంరెడ్డిని సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్, ఆయనతో కలిసి భోజనం చేశారు. యోగక్షేమాలు తెలుసుకున్న తర్వాత, తెలంగాణ ఉద్యమం, ప్రత్యేక రాష్ట్ర అవతరణ తదితర అంశాలపై మాట్లాడుకున్నారు. ఆ తర్వాత సిఎం తన కారులోనే రాంరెడ్డిని ఎక్కించుకుని సచివాలయం వచ్చారు. నేరుగా తన ఛాంబర్ లోకి తీసుకెళ్లారు. అక్కడ పలువురు ఉన్నతాధికారులకు రాంరెడ్డిని పరిచయం చేశారు. ఉద్యమ సమయంలో రాంరెడ్డి గోసను యావత్ తెలంగాణకు వివరించిన విధానాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నల్గొండ జిల్లా, నల్గొండ మండలం మోశంపల్లికి చెందిన బైరెడ్డి రాంరెడ్డి నీళ్ల కోసం తన వ్యవసాయ భూమిలో 67 సార్లు బోర్లు వేసి ఆర్థికంగా చితికి పోయాడు. ఆయన బాధను కేసీఆర్ అనేక సందర్భాల్లో, అనేక సభల్లో చెప్పారు. తెలంగాణలో రైతులు ఎంత గోస పడుతున్నారో చెప్పడానికి రాంరెడ్డి ఉదంతాన్ని చెప్పేవారు. కేసీఆర్ స్వయంగా బైరెడ్డి రాంరెడ్డి పేరును బోర్ వెల్ రాంరెడ్డిగా సంబోధించేవారు. ఆయన దీనస్థితిని ప్రధాన ఇతివృత్తం చేసుకుని 'స్టిల్ సీకింగ్ జస్టిస్' పేరుతో ఓ డాక్యుమెంటరీ కూడా తీశారు. ఆ డాక్యుమెంటరీని ఢిల్లీలో కూడా ప్రదర్శించారు. ఇవన్నీ సంగతులను ముఖ్యమంత్రి మరోసారి గుర్తు చేసుకున్నారు.

గోసపడ్డ తెలంగాణ బాగు పడాలన్నదే తన తపన అని ఈ సందర్భంగా రాంరెడ్డి చెప్పారు. తన గ్రామానికి  రోడ్లు కావాలని, చెరువును బాగు చేయాలని, నల్గొండ వ్యవసాయ మార్కెట్ కూడా రైతుల అవసరాలకు అనుగుణంగా లేదని రాంరెడ్డి ముఖ్యమంత్రికి చెప్పారు. సిఎం వెంటనే స్పందించి రహదారుల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును రహదారుల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.  ఆ తర్వాత రాంరెడ్డిని, ఇతర రైతులను మంత్రి హరీష్ రావు దగ్గరికి పంపారు. ముఖ్యమంత్రి తన కార్యాలయంలో పనిచేసే ఉద్యోగిని తోడు ఇచ్చి డి బ్లాక్ లోని హరీష్ రావు దగ్గరికి పంపారు. హరీష్ రావుతో సిఎం కూడా ఫోన్లో మాట్లాడి రాంరెడ్డి చెప్పిన విషయాలపై స్పందించాలని కోరారు. అటు మంత్రి హరీష్ రావు కూడా రాంరెడ్డి చెప్పిన విషయాలన్నీ సావధానంగా విని, వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఉద్యమ సమయంలో పరిచయమైన తనను గుర్తు పెట్టుకుని, ఆదరించిన ముఖ్యమంత్రికి రాంరెడ్డి, ఇతర రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

..............................................................................................................................
.

**సిపిఆర్ఓ టు సియం**